క్లుప్తంగా

నైపుణ్యాలను వెలికి తీసేందుకే విజ్ఞాన ప్రదర్శనలు



గుడివాడ టౌన్: విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని వన్ టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక రవీంద్రభారతి స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో వారి ఆలోచనా విధానం ఎంతో మృదువుగా ఉంటుందన్నారు. దానికి పదును పెట్టడానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, ఈ విధమైన ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, ఆర్కా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అజయ్, రవీంద్ర భారతి ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ ప్రియాంక పాల్గొన్నారు.

మహిళలకు నూతన వస్త్రాల అందజేత



పామర్రు: స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్ 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ నిర్వాహకులు, క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు బైబుల్ పై శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పేద మహిళలకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో టౌన్ పాస్టర్ల సంక్షేమ సంఘ సభ్యులు నికోదేము, శాలెం రాజు, మోషే, సంగీతరావు, శామ్యూల్ పాల్గొన్నారు.

చోరగుడి సర్పంచ్, కార్యదర్శికి సత్కారం



పమిడిముక్కల: ఢిల్లీలో ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డులు అందుకున్న చోరగుడి సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, కార్యదర్శి టీవీ రమణను శనివారం సచివాలయంలో ఘనంగా సత్కరించారు. చోరగుడి పంచాయతీ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పలు అవార్డులు సాధించిందని కార్యదర్శి రమణ తెలిపారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: వలంటీర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో అవార్డులు పొందిన మండలంలోని వలంటీర్లను శనివారం సన్మానించారు. కైకలూరు-5వ సచివాలయం నుంచి షేక్ అయేషా అతీకకు సేవా వజ్రా పురస్కారం, భుజబలపట్నం నుంచి అద్దంకి రవికుమార్, కైకలూరు-3 నుంచి నాగిరెడ్డి తులసి, కైకలూరు-5 నుంచి షేక్ ఖాసీంబీ, కొట్టాడ నుంచి ఘంటసాల అనూష, వరహాపట్నం నుంచి బోయిన లక్ష్మికి సేవారత్న, సేవా మిత్ర పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భట్రాజు శివాజీ, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, నాయకులు బొడ్డు నోబుల్, సయ్యపురాజు గుర్రాజు రాష్ట్ర ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం

కలిదిండి: ప్రస్తుతం నిర్వహిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమం వారు చేసిన సేవలకు సత్కారమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొని ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలను అందించి సత్కరించారు. మండలంలో సేవా వజ్ర పురస్కారాలకు జి.సావిత్రి, సీహెచ్ తేరాజమ్మ ఎంపికయ్యారు. రాణి, పోసిన మేరీ, రామల్లి దివ్య, సాన బోయిన కావ్య, పాము యేసేబుకు సేవారత్న పురస్కారాలను, సేవా మిత్ర పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దినతేజ్, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, నాయకులు బొడ్డు నోబుల్, సయ్యపురాజు గుర్రాజు, సర్పంచ్ మసీముక్కు మారుతి ప్రసన్న పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ, వేదికపై ఎమ్మెల్యే డీఎన్నార్ తదితరులు

కొల్లేరు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

కైకలూరు: కొల్లేరు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కొట్టాడ పంచాయతీ జంగపాడు, పల్లెపాలెంలో రూ.6 లక్షల గడప గడపకు నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. పందిరిపల్లిగూడెంలో రూ.3.79 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, శృంగవరప్పాడులో రూ.15.60 లక్షల గడప గడపకు నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైయిన్లు, ఇదే గ్రామంలో రూ.14 లక్షలతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురేళ్ల బేబీ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బలరామరాజు, సర్పంచ్‌లు కొల్లాటి పద్మావతి, ఘంటసాల భాగ్యలక్ష్మి, బలే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డీఎన్నార్

హక్కుల కోసం పోరాడాలి

మండవల్లి: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, కొరపాటి శాంతరాజు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, డి.రాజకుమార్ రచించిన సామాజిక విప్లవ యోధులు, జ్యోతి బాపూలే, పెరియార్ ఈవీ రామస్వామి, మహర్షి నారాయణగురు, కాన్షీరామ్ జీవిత చరిత్ర పుస్తకాలను కార్యవర్గ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాగోలు అభిష, చాబత్తిన విజయ్, చిగురుపాటి ఐజక్, గాలి నాగయ్య, మెండ సురేష్, బేతపూడి తంబి తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలను అందుకున్న కార్యవర్గ సభ్యులు

21న శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తోట్లవల్లూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని ఐలూరులో గల శ్రీగంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 21న శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎం. కుసుమకుమారి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నాట్యంతో అలరించిన కళాకారిణులు

గుడ్లవల్లేరు: స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవ వేడుకల్లో శనివారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ నాట్య కారిణి పద్మశ్రీ గెడ్డం పద్మజారెడ్డి బృందం బాలే శైలిలో శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. వయోలిన్ విద్యాంసురాలు పద్మశ్రీ అవసరాల కన్యాకుమారి బృందం స్వర సమ్మేళనం పేరిట త్యాగరాజ కీర్తనలు, అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. అనంతరం కళాకారులను కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ఫార్మసీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, డైరెక్టర్లు ముసునూరి శ్రీనివాసరావు సన్మానించారు. ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, సలహాదారు డాక్టర్ పి.రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోదండ రామారావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదలు సుభిక్షం

గుడ్లవల్లేరు: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించడంతో పేద కుటుంబాలన్నీ సుభిక్షంగా ఉన్నాయని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. శనివారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తమ గ్రామాల్లోని సమస్యలపై అధికారులను చినగొన్నూరు, గాదేపూడి, కట్టవానిచెరువు సర్పంచ్‌లు నాగు, లక్ష్మణరావు, వీరమ్మ, ఎంపీటీసీ సోమేశ్వరరావు ఆయా శాఖల అధికారులను ప్రశ్నించారు. ఆయా సమస్యలను తీరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, ఎంఈఓ గోపాలరావు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాసం శనివారం పురస్కరించుకుని భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర దేవస్థానానికి అన్న ప్రసాద సేవా ట్రస్టు కార్యదర్శి నందమూరి జయకృష్ణ ప్రసాద్ స్వరాజ్యలక్ష్మి దంపతుల 52వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. దంపతుల సౌజన్యంతో ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు సుదర్శనం యోగానంద లక్ష్మీ నర్సింహాచార్యులు దంపతులకు స్వామి ఆశీర్వచనాలను అందజేశారు. కార్యక్రమంలో పామర్రు కళాపరిషత్ అధ్యక్షుడు త్రివిక్రమరావు, గౌరవాధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్, డైరెక్టర్ రామారావు, అన్న ప్రసాద సేవా ట్రస్టు ప్రతినిధులు దంపతులను సన్మానించారు.

కోడిపందేల శిబిరంపై దాడి

పమిడిముక్కల: మండలంలోని కపిలేశ్వరపురం శివారు ముత్రాసిపాలెంలో కోడిపందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఒక కోడిని, రూ.3,080ను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా కృష్ణాపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఐదు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల తనిఖీ

కలిదిండి: పోతుమర్రు గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను మండలం విద్యాశాఖాధికారి పి.ప్రభాకర్ రావు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించి రుచికరంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు వలంటీర్లకు వందనం

మండవల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు.

అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: శ్రీహరిపురం శివారు చేవూరు పాలెం తిరుపతమ్మ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ఆలయ నిర్వాహకులు, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు పూజలు చేసి అన్నసమారాధనను ప్రారంభించారు.

ఉత్తమ వలంటీర్లు వీరే

ముదినేపల్లి రూరల్: మండలంలోని సచివాలయల పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సత్కరించేందుకు మండలంలో ఆరుగురు వలంటీర్లను ఎంపిక చేశారు. వీరిలో బొమ్మినంపాడుకు చెందిన వలంటీరు కొన్నమూడి నాగబాబు సేవ వజ్ర అవార్డుకు ఎంపిక కాగా అల్లూరు, బొమ్మినంపాడు, పెదగొన్నూరు, పేరూరు, వణుదుర్రు గ్రామాల వలంటీర్లు మందాడ నాగలక్ష్మీ, దండే శారద, సాయిల నాగమల్లేశ్వరరావు, గొర్ల ఈశ్వరీదుర్గ, కురేళ్ల స్రవంతి సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. వీరిని ముదినేపల్లిలో ఆదివారం నిర్వహించనున్న సమావేశంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సత్కరిస్తారని ఎంపీడీఓ గంగాధరరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల కలయిక ఉత్సాహభరిత వాతావరణంలో శనివారం నిర్వహించారు. ఈ హైస్కూల్ 1987 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులంతా ఒక్కటై సందడి చేశారు. తమకు పాఠాలు బోధించిన గురువులు చల్లగుల్ల రామారావు, కల్యాణపు ప్రేమలతను, పాఠశాల హెచ్ఎం శాంతకుమారిని సత్కరించారు.

విద్యార్థినిపై కేసు నమోదు

పామర్రు: ఓ విద్యార్థిని మరొక విద్యార్థిని స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన సంఘటపై పామర్రు పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని నిమ్మకూరులోని ఏపీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని అక్కడ కూలి పని చేస్తున్న చింతయ్య అనే వ్యక్తి వద్ద నుంచి సెల్ ఫోన్ తీసుకుని తన తోటి విద్యార్థిని హాస్టల్లో స్నానం చేస్తుండగా వీడియో తీసింది. ఈ విషయం గమనించిన ఆ విద్యార్థిని హాస్టల్ వార్డెన్‌కు తెలిపింది. దీంతో ఆ సెల్‌ను ఆమె వద్ద నుంచి తీసుకుని సంబంధిత విద్యార్థిని మందలించారు. ఈ విషయమై మనస్థాపానికి గురైన విద్యార్థిని బ్లేడ్‌తో చేతిపై కోసుకుని, ఆ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపింది. విద్యార్థిని తల్లిదండ్రులు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సెల్ ఫోన్ ఇచ్చిన చింతయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై పామర్రు సీఐ సుభాకర్ కేసు నమోదు చేసి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే పాటూరును సన్మానించిన జూపూడి



మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను సన్మానిస్తున్న జూపూడి ప్రభాకరరావు

మచిలీపట్నంటౌన్: మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్యను రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు శనివారం సన్మానించారు. మచిలీపట్నం విచ్చేసిన జూపూడి ప్రభాకరరావును స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలిసిన మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య కలవగా ఆయన రామయ్యకు శాలువా కప్పి సత్కరించారు. నాలుగుసార్లు నిడుమోలు ఎమ్మెల్యేగా పనిచేసిన పాటూరు రామయ్య సేవలను కొనియాడారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం జిల్లాలో పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్, ఎన్నికలు తదితర అంశాలపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుడ్లవల్లేరు ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగే సిల్వర్‌జూబ్లీ వేడుకలకు గవర్నర్ హాజరుకానున్నారన్నారు. ఉదయం 9.45 గంటలకు విజయవాడ రాజ్‌భవన్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11:15 గంటలకు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల చేరుకుంటారన్నారు. అనంతరం 12.25 గంటలకు ఇంజినీరింగ్ కళాశాల నుంచి బయలుదేరి విజయవాడ రాజభవన్‌కు వెళ్తారన్నారు. గవర్నర్ పర్యటించే మార్గంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఇళ్ల స్థలాల విషయంపై మాట్లాడుతూ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు సరాసరిన 70 శాతం పూర్తయిందని, వచ్చే రెండు రోజుల్లో మిగిలిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 క్లయిమ్‌లను అన్ని విధాలా విచారించి సత్వరమే పరిష్కరించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీవో కె.చంద్రశేఖరరావు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అధ్యాపక వృత్తిలోనే ఆత్మ సంతృప్తి

నిమ్మకూరు(పామర్రు): అధ్యాపక వృత్తిలో ఉండేవారికి ఆత్మ సంతృప్తి ఉంటుందని ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ టీ అప్పారావు అన్నారు. మండలంలోని నిమ్మకూరులో ఏపీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకట జగన్నాథరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు తొలుత అధ్యాపకుల దగ్గర విద్యాబోధన, శిక్షణ పొందిన వారే అని గుర్తు చేశారు. ఉత్తమ విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థుల మనస్సులలో ఎల్లప్పుడూ చిరస్థాయిగా గుర్తుండిపోతారన్నారు. అటువంటి వారిలో జగన్నాథరావు మాస్టారు ఒకరని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత జీవితం కూడా ఎంతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకట జగన్నాథరావు, కల్యాణి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాపతి, అధ్యాపకులు జె సోమదత్తు, పామర్తి వెంకటనారాయణ, జి.రంగాచారి, భాను ప్రసాద్, హరికృష్ణ, బీఎస్ లక్ష్మీదేవి, శిరీష, పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



జగన్నాథరావు దంపతులను సన్మానిస్తున్న అధ్యాపకులు

పురుగుమందులన్నీ ఒకేసారి పిచికారీ చేయకూడదు

కూచిపూడి(మొవ్వ): రైతులు రెండు, మూడు అంతకంటే ఎక్కువ రకాల పురుగు మందులను కలిపి ఒకేసారి పిచికారీ చేయకూడదని మచిలీపట్నం వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ కే జ్యోతి రమణి సూచించారు. మొవ్వ మండలం కూచిపూడిలోని కోఆర్డినేటర్ కే జ్యోతిరమణి ఇతర వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శనివారం మినుము పైరును పరిశీలించారు. మినుములో సీతాఫల తెగులు, తామర తెగులు, తలమాడు తెగులు కనపడుతోందని పేర్కొన్నారు. వీటి నివారణకు వేప నూనె ఎకరాకు 500ఎంఎల్, ఫిప్రోనిల్ 400 ఎంఎల్ లేదా నోవాలరోన్ 200 ఎంఎల్ పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే ఆకుపచ్చ, కాండం గజ్జి తెగులుకు కాంటా4 మందు పిచికారీ చేయాలని కే జ్యోతి రమణి సూచించారు. కార్యక్రమంలో మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కే శ్రీనివాసరావు, మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల, ఏఓలు శివప్రసాద్, బి.పద్మజ, వీఏఏ కుమార్ పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఎన్నికల నిబంధనలపై అవగాహన ఉండాలి

గుడివాడ టౌన్(నందివాడ): రానున్న ఎన్నికల నిబంధనలపై ప్రజల్లో కనీస అవగాహన ఉండాలని నందివాడ ఎస్సై ఎస్. చంటిబాబు అన్నారు. శనివారం నందివాడ మండలం తమిరిశ గ్రామంలో ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యంలో దానివిలువ ఎంతో ఉంటుందన్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఇతర గుర్తింపు కార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు.

జూదరుల అరెస్ట్

మండలంలోని వెంకట రాఘవాపురం గ్రామంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.10,121 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని ఏడు గొర్రెలు మృతి

రామానగరం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరంలో శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. మచిలీపట్నం వైపు నుంచి వస్తున్న టిప్పర్ లారీ రామానగరం శ్మశానం వద్ద రోడ్డుపై నుంచి వెళుతున్న గొర్రెల మంద పైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాయి. మరో నాలుగు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డకు చెందిన గొర్రెల కాపరి డొక్కు కృష్ణకు చెందిన గొర్రెలు ఈ ప్రమాదంలో చనిపోయి రూ.లక్షన్నర నష్టం వాటిల్లింది. గొర్రెల మరణానికి కారకుడైన టిప్పర్ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సీహెచ్ చినబాబు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పెడనలో పట్టపగలు చోరీ

పెడన: పట్టణంలోని మూడో వార్డుకు చెందిన బొడ్డు సూర్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 15వ తేదీ స్థానిక శ్రీభద్రావతి సమేత శ్రీభావనారుషి ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవ సంబరాలకు హాజరయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న సుమారు రూ.40 వేల విలువ గల 20 గ్రాముల గొలుసు, ఉంగరం, చెవిదిద్దులు, వాటితో పాటు రూ.15వేలు నగదు అపహరించారు.బాధితుడు సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.